సాక్షి గుంటూరు
సోమవారం, 19, ఆగస్టు, 2024



వైభవంగా కల్యాణ మహోత్సవం

వినుకొండ(నూజెండ్ల): శ్రీనివాసనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు.



నిండిన పులిచింతల

అచ్చంపేట: పులిచింతల జలాశయం పూర్తిగా నిండింది. నీటినిల్వ 45.10 టీఎంసీలకు చేరింది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

మహాశక్తి అలంకారంలో బండ్లమ్మ



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాశక్తి దేవిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నగరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



నెహ్రూనగర్: నగరాభివృద్ధిపై పూర్తి దృష్టి సారించడంతోపాటు రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, శానిటేషన్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, కార్పొరేషన్‌పై ఉన్న వ్యయభారం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు సూచించారు. గుంటూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి పెమ్మసానిని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం కలిశారు. నగరంలోని పలు సమస్యలపై ఇరువురు చర్చించారు. రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, పారిశుద్ధ్య సమస్యలతోపాటు రెవెన్యూ వసూళ్లకు ఎదురవుతున్న ఇబ్బందులను పెమ్మసానికి కమిషనర్ వివరించారు. కార్పొరేషన్‌పై పడుతున్న రెవెన్యూ భారాన్ని తగ్గించి, జీఎంసీకి రావాల్సిన ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని కమిషనర్‌కు పెమ్మసాని సూచించారు. నగరాభివృద్ధితోపాటు ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ వంటి పలు సుందరీకరణ కార్యక్రమాలను కూడా చేపట్టాలని రాబోయే 2 వారాల్లో పక్కా ప్రణాళికలను సిద్ధంగా చేయాలని సూచించారు. కార్పొరేషన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించాలని పెమ్మసాని సూచించారు.

తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ బదిలీ




తెనాలి: తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ బదిలీ అయ్యారు. ఆయనను పాడేరు సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. పాడేరు ఐటీడీఏ పీవో బాధ్యతలనూ ఆయనకు అప్పగించినట్టు తెలిసింది. తెనాలి సబ్‌కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ప్రఖర్‌జైన్ గతేడాది డిసెంబరులో తెనాలి సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆనెల 21న బాధ్యతలు స్వీకరించారు. తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి 96వ అధికారిగా నియమితులైన ఆయన ఎనిమిది నెలలకే బదిలీ అయ్యారు.

25న రాష్ట్రస్థాయి శతాధిక కవి సమ్మేళనం

ఫిరంగిపురం: తెలుగు భాషాదినోత్సవం (గిడుగు వెంకటరామమూర్తి జయంతి) పురస్కరించుకొని ఈనెల 25న రాష్ట్రస్థాయి శతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కొండవీడు రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్‌రఫీ, కార్యదర్శి టి.గోవిందయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిరంగిపురంలోని వేణుగోపాలస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాల్గొనే కవులు, రచయితలకు మధ్యాహ్న భోజన వసతి, శాలువా , జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఇచ్చి గౌరవిస్తామని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 9032380696, 9966385583 నంబర్లలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 7,837 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 336 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1,861 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 765 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 280 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 450 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 36150 క్యూసెక్కులు విడుదల చేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల

విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ వద్ద ఆదివారం రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. రెండు క్రస్ట్‌గేట్లు ఎనిమిది అడుగుల మేర ఎత్తి 24,920 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉండగా ఇది 312.0450 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ నుంచి కుడికాలువకు 8,067, ఎడమకాలువకు 6,791 క్యూసెక్కులు వదులుతున్నారు.

దుక్కి దాయిని..!

రైతులకు 'హై'రానా

- హైలెవెల్ చానల్‌తో అగచాట్లు
- వర్షాలు రాకుంటే తప్పని కడగండ్లు
- ఈ ఏడాది ఆరంభంలోనే కష్టాలు
- రైతుల ఆందోళనతో కదిలిన అధికారులు
- మరో ఎత్తిపోతల పథకం ప్రతిపాదనలకు హామీ



ఖాజీపేట వద్ద హైలెవెల్ చానల్‌పై ఆదివారం ఉదయం నీరు తోడుతున్న ఆయిల్ ఇంజిన్

తెనాలి: హైలెవెల్ చానల్.. పంటపొలాలకు జీవధారలు అందించాల్సిన పంటకాలువ. వాస్తవానికి రైతుల దుఃఖదాయినిగా పేరొందింది. ఈ కాలువ కింద ఆయకట్టు రైతులు ఏటా కష్టాల సాగు చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల సాగు వరుణుడి దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడి ఉంటోంది. వర్షాలు కురవకపోతే ఆయిల్ ఇంజిన్లు, బోర్లతోనే భూగర్భజాలను తోడుకుని పంటలను కాపాడుకోవాల్సిన దుస్థితి. దీంతో పెట్టుబడి వ్యయం పెరుగుతూ పంటల ఉత్పత్తి తగ్గిపోతోంది. గతంలో ఆరంభించిన ఎత్తిపోతల పథకం ఇంకా పూర్తికాలేదు. మళ్లీ ఇప్పుడు మరో ఎత్తిపోతల పథకం ప్రతిపాదనలకు అధికారులు హామీనిచ్చారు.

దిగువ భూములకు గగనం

కృష్ణాడెల్టా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ నుంచి పెదవడ్లపూడి వద్ద చీలే హైలెవెల్ చానల్ కింద దుగ్గిరాల, పెదకాకాని, తెనాలి మండలాల్లోని 25 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఎగువ భూముల సంగతటుంచి, దిగువ భూములైన తెనాలి మండల పరిధిలోని 10 వేల ఎకరాలకు సాగునీరు చేరటం గగనమవుతోంది. ప్రధాన కాలువలో నీరు గరిష్ట మట్టంలో సరఫరా ఇచ్చినపుడే హైలెవెల్ చానల్ నుంచి ఆయకట్టుకు సరిపడా నీరు విడుదల చేయగలుగుతారు. లేకుంటే అరకొర నీటితోనే సరిపెడుతుండటం రివాజు. కొలకలూరు, ఖాజీపేజ, హాఫ్‌పేట, అక్కడకు సమీపంలోని తంగెళ్లమూడి గ్రామాల ఆయకట్టుకు ఈ పరిస్థితి సంకటంగా మారింది. ఎగువ భూముల్లోని రైతులు ముందుగా తమ భూములకు నీటితడులు ఇచ్చుకోవాలనే తాపత్రయంతో ఎక్కడికక్కడ చానల్‌కు అడ్డుకట్టలు వేస్తున్నారు. దీంతో దిగువ భూములకు నీరందటం అసాధ్యంగా మారింది. పర్యవేక్షించాల్సిన లస్కర్ల వ్యవస్థకు ఏనాడో మంగళం పాడేశారు. పశ్చిమడెల్టాలో 210 లస్కర్లు ఉండాల్సి ఉండగా, కేవలం 38 మందే కొనసాగుతున్నారు.

కొమ్మమూరు కాలువపై ఎత్తిపోతలకు హామీ

హైలెవెల్ చానల్ ఆయకట్టు రైతుల కడగండ్లను తీర్చేందుకు పెదవడ్లపూడి వద్ద ప్రధాన కాలువపై ఎత్తిపోతల పథకానికి 2018–19లోనే శ్రీకారం చుట్టారు. ఇందుకోసం రూ.14.90 కోట్లు మంజూరైనట్టు ప్రకటించారు. పనులు ప్రారంభమైనా పూర్తికాలేదు. కారణం తెలియదు. ఈ నేపథ్యంలో దిగువ భూముల రైతులు కొలకలూరులో కొమ్మమూరు కాలువపై మరో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని ఆదివారం ఖాజీపేటలో ఏర్పాటుచేసిన గ్రామసభలో డిమాండ్ చేశారు. దీనికి జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు ఉమామహేశ్వరరావు, పశ్చిమడెల్టా ఈఈ ఎస్.మల్లికార్జున, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అంగీకరించారు. ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. దీనినైనా సత్వరం నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

రైతుల ఆందోళనతో కదలిక

ఈఏడాది హైలెవెల్ చానల్ దిగువ భూములకు నీరందని పరిస్థితి. ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడుకుని, పైపులద్వారా సుదూరంలోని పొలాలకు రైతులు నీరందిస్తున్నారు. అయినా పట్టని అధికారుల తీరుపై నిరసనగా కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట, తంగెళ్లమూడి రైతులు శనివారం రోడ్డెక్కి ఆందోళన చేశారు. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. అక్రమ నీటి మళ్లింపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎగువన ఒక తూముకు ఏకంగా చెక్కను బిగించేసి కొందరు రైతులు నీటిని మళ్లించుకుంటున్నారు. కంఠంరాజు కొండూరు వద్ద నీరు బ్రాంచ్ కాలువకు రాకుండా డ్రాఫ్ట్‌ను కట్టారని చెబుతున్నారు. ఈ నిర్లక్ష్య వ్యవహారంపై ఏఈ విద్యావతిని బదిలీ చేసి, ఆమె స్థానంలో వెంకటేశ్వరరావును అధికారులు తీసుకొచ్చారు.

నీటి సరఫరా పెంపు



గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ ఉమామహేశ్వరరావు

హైలెవెల్ చానల్ ఆయకట్టు రైతులు శనివారం రోడ్డెక్కిన నేపథ్యంలో అధికారులు దిగొచ్చారు. 24 గంటల్లోనే నీటి సరఫరాను పెంచారు. అడ్డుకట్టలను తొలగించారు. కంఠంరాజుకొండూరు వద్ద నీటిని మళ్లించేందుకు బిగించిన చెక్కను తీసేయించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఏఈని బదిలీ చేశారు. ఆదివారం ఖాజీపేటలోని హైలెవల్ చానల్‌ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, కృష్ణాపశ్చిమ డెల్టా ఈఈ ఎస్.మల్లికార్జున పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. తర్వాత ఖాజీపేటలోని కమ్యూనిటీ హాలు వద్ద జరిగిన గ్రామసభలో రైతులతో మాట్లాడారు. జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు ఉమామహేశ్వరరావు, డీఈఈ ఎన్‌వీ కిషోర్, ఏఈ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దుగ్గిరాల సమీపంలోని చంద్రమౌళి వాగు వద్ద లేదా కొలకలూరులో కొమ్మమూరు కాలువ నుంచి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని రైతులు కోరడంతో ప్రతిపాదనలు పంపుతామని హామీనిచ్చారు.

జీతాలు 'బాబో'!

- ఆప్కాస్ ఉద్యోగుల ఆందోళన
- బిల్లు ప్రాసెస్ చేసినా జమ కాని నగదు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- నగరపాలకసంస్థలో 3వేల మంది ఉద్యోగుల ఆర్తనాదాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆప్కాస్(కాంట్రాక్టు) ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో ప్రతి నెలా 1నే జీతాలు జమచేసేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే జీతాలు వేస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగులకు తీవ్ర ఆలస్యం చేస్తోంది. గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులకు 19వ తేదీ వచ్చినా ఇంకా జీతాలు పడలేదు. ప్రతి నెలా 25లోగా సిబ్బంది అటెండెన్స్ అప్కాస్‌కి వెళ్లిపోవాలి. అక్కడి నుంచి సీఎఫ్ఎంఎస్‌లో బిల్ నంబర్ జనరేట్ అవుతుంది. సీఎఫ్ఎంఎస్ ద్వారా సంబంధిత డీడీఓ హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి ఆటో డెబిట్ అవుతుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాతే 1న సిబ్బందికి జీతాలు పడతాయి. అయితే గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరి బదిలీ కావడంతో రాజమండ్రిలో కమిషనర్‌గా పనిచేస్తున్న దినేష్‌కుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఆయన కొన్ని కారణాల వల్ల బాధ్యతలు స్వీకరించలేదు. మున్సిపల్ ఆర్డీ హరికృష్ణకు గుంటూరు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గత నెల 31న కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ లాగిన్ ఆలస్యంగా రావడంతో ఈనెల 5 తరువాత జీతాల బిల్లును ఆమోదించారు. బిల్లు ప్రాసెస్ చేసి రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం ఇంకా ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు వేయలేదు. నగరపాలక సంస్థ పరిధిలో మూడు వేల మంది సిబ్బంది ఆప్కాస్ పద్ధతిలో పని చేస్తున్నారు. జీతాలు ఆలస్యం కావడంతో వీరు ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, ఇంట్లో ఖర్చులు, ఈఎంఐలు చెల్లించేందుకు నానా తంటాలు పడుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు వేయకపోతే తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మంగళగిరిలో మానవహారం నిర్వహిస్తున్న ఎయిమ్స్ విద్యార్థులు

వైద్యవిద్యార్థుల నిరసన

మంగళగిరి: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ మంగళగిరి ఎయిమ్స్ విద్యార్థులు చేస్తున్న ఉద్యమం కొనసాగుతోంది. నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం విద్యార్థులు మానవహారం నిర్మించారు. కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ తక్షణం నిందితులను అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆరో రోజుకు జూడాల సమ్మె

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ గుంటూరు జీజీహెచ్‌లోని జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. అత్యవసర వైద్యసేవలూ బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బైఠాయించి నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో జూడాల సంఘం నేతలు డాక్టర్ దీక్షిత్, డాక్టర్ అన్వర్ బాషా, డాక్టర్ రవి, డాక్టర్ అశ్విని, డాక్టర్ భవిత తదితరులు పాల్గొన్నారు. గుంటూరు బైక్ బండిట్స్ రైడింగ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలోనూ నిరసన తెలిపారు. నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. లాడ్జిసెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.



గుంటూరు జీజీహెచ్‌లో ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు

ఛాయా 'చిత్రముగ్ధం'

- వైద్యుడి 'హస్తవాసి'
- వృత్తి వైద్యం.. ప్రవృత్తి ఫొటోగ్రఫీ
- వైల్డ్ ఫొటోగ్రఫీలో దిట్ట
- అంతర్జాతీయ వేదికపై అవార్డుల పంట
- సంగీతం.. హ్యాండ్ ఆర్ట్‌లోనూ అందెవేసిన చేయి
- బహుముఖ ప్రజ్ఞాశాలి.. డాక్టర్ వెంకటరమణ
- నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం

గుంటూరు మెడికల్ : ఆయనో డాక్టర్ రోగుల నాడి పట్టడంలో సిద్ధహస్తులు. కెమెరా పట్టుకుని వన్యప్రాణుల ఫొటోలు తీసి అవార్డులు కొల్లగొట్టడంలోనూ దిట్ట. సంగీతంలోనూ తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. నరేంద్ర వెంకట రమణ.. గుంటూరులో పరిచయం అక్కర్లేని వైద్యుడు. గుంటూరు కొత్తపేట గౌడీయమఠం సమీపంలోని అమ్మాజి పావని మెమోరియల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించి రోగులకు సేవలు అందిస్తున్నారు. ఆయన చేయి పడితే రోగాలు ఇట్టే నయమైపోతాయని రోగుల నమ్మకం. తండ్రి గోపాలరావు బాటలోనే వైద్యవిద్యనభ్యసించిన వెంకట రమణ ఆయన ప్రవృత్తినీ పుణికిపుచ్చుకున్నారు. గోపాలరావుకు ఫొటోగ్రఫీ అంటే ఆసక్తి. ఆయన ఫొటోలు తీసేందుకు వెంకట రమణను వెంటబెట్టుకెళ్లేవారు. అలా వెంకట రమణకూ ఫొటోగ్రఫీపై ఆసక్తి పెరిగింది. అందుకే రమణ వైద్యవృత్తిని కొనసాగిస్తూనే ఫొటోగ్రఫీలోనూ రాణిస్తున్నారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగానూ కొనసాగుతూ ఫొటోగ్రఫీ పోటీల్లో న్యాయనిర్ణేతగా, జ్యూరీ సభ్యుడిగా ఎంతో మంది ఫొటోగ్రాఫర్లకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

స్వర రమణీయం



గిటార్ ప్లే చేస్తున్న డాక్టర్ వెంకట రమణ

వెంకట రమణ సంగీతంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఫ్లూట్, తబలా, కీబోర్డు, గిటార్ తదితర వాయిద్యాలతో స్వరఝరిలో శ్రోతలను ఉర్రూతలూగించగలరు. హ్యాండ్ ఆర్ట్‌తోనూ ఆయన అబ్బురపరుస్తారు. ఆయన తన అరచేతితో గోడపై బొమ్మ గీస్తే ప్రాణం పోసినట్టే ఉంటుంది.

గత ఏడాది బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ వారి ఏఆర్‌పీఎస్ ఫెలోషిప్‌కు ఎంపికైన ఏకైక భారతీయుడిగా వెంకటరమణ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.

వరించిన డిగ్రీలు, అవార్డులు

వెంకట రమణ ప్రతిభకు ఎన్నో అవార్డులు వరించాయి. అమెరికాలోని పలు సంస్థలు ఆయనకు డిగ్రీలను అందజేశాయి. ఇంగ్లాండ్‌కు చెందిన ఏఆర్‌పీఎస్, అమెరికాకు చెందిన ఎంఐఐసీఎస్, ఈయూఎస్‌పీఏ, ఆస్ట్రేలియాకు చెందిన ఏపీపీఎస్, ఇండియాకు చెందిన ఏఐఐపీసీ సంస్థలు, అసోసియేట్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ కొలీగ్స్ సొసైటీ, అసోసియేట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్ ఫొటోగ్రఫీ అకాడమి, ఫెల్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ కొలీగ్స్ సొసైటి ఫొటోగ్రఫీలో మాస్టర్ డిగ్రీలను, ఫెలోషిఫ్‌లను అందించాయి. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ ఢిల్లీ, కేరళ సొసైటి బెటర్ ఆర్ట్ ఫౌండేషన్, ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీ, పలు జాతీయ సంస్థల నుంచి 15కుపైగా అవార్డులను, ఇంటర్నేషనల్ యాక్సిటెన్సి–200 అవార్డును వెంకటరమణ అందుకున్నారు.

సాహస ఫొటోగ్రాఫర్



ప్రత్యేక కెమెరా లెన్స్‌తో డాక్టర్ వెంకటరమణ

డాక్టర్ వెంకట రమణ తీసిన ఫొటోల్లో జీవం ఉట్టిపడుతుంది. మహారాష్ట్రలోని తిప్పేశ్వరంలో ఏడేళ్లపాటు కెమెరాతో తిరిగి రాయల్ బెంగాల్ టైగర్ డాక్యుమెంటరీని ఆయన చిత్రీకరించారు. మూడు తరాలకు చెందిన సుమారు 80కిపైగా పులుల ఫొటోలు తీశారు. పులుల జీవన విధానాన్ని దగ్గరుండి అధ్యయనం చేశారు. ఈ ఫొటోలను అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీలకు పంపగా.. జడ్జిలు మంత్రముగ్ధులై 2023 ఏప్రిల్‌లో సాహస ఫొటోగ్రఫీ అవార్డుతో సత్కరించారు. వెంకటరమణ 15 ఏళ్లుగా వన్యప్రాణుల చిత్రాలను తీసేందుకు ఆఫ్రికా, కెన్యా, టాంజానియా దేశాలతోపాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర ప్రాంతాల్లోని వన్యప్రాణి కేంద్రాలను సందర్శించారు.



డాక్టర్ వెంకట రమణ కెమెరా బంధించిన సుమనోహర ఛాయాచిత్రాలు

ఇంద్రకీలాద్రిపై పవిత్రోత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. దేవాలయంలో జరిగే తెలిసీ తెలియని దోష పరిహారానికి, కాలచక్రంలో వచ్చే దోష నివారణకు ఏటా శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలను ఇంద్రకీలాద్రిపై మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఉత్సవాలు మంగళవారం వరకు కొనసాగుతాయి. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజ అనంతరం పవిత్రాల అలంకరణ అనంతరం ఉదయం 8.25 గంటలకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, సర్వప్రాయశ్చిత విధులు నిర్వహించారు. పూజల్లో ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం మల్లేశ్వరస్వామితో పాటు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శివకామసుందరీ సమేత నటరాజ స్వామి, గణపతి, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి, క్షేత్రపాలకుడు వీరాంజనేయస్వామితో పాటు ఇతర దేవతా మూర్తులకు, ఆయా దేవతా మూర్తుల వాహనాలకు అర్చకులు శాస్త్రోక్తంగా పవిత్ర మాలధారణ చేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఈవో కె.ఎస్.రామరావు, ప్రధాన అర్చకుడు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు మురళి, పండు, రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, కోట ప్రసాద్ ఇతర వేద పండితులు మాలధారణ జరిపించారు.



నందీశ్వరుడికి పవిత్రాలను అలంకరిస్తున్న ఈవో రామరావు

క్లుప్తంగా

వలంటీర్లకు న్యాయం చేయండి

ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు వలంటీర్స్ అసోసియేషన్ డిమాండ్



లక్ష్మీపురం: వలంటీర్స్‌కి న్యాయం చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య, జిల్లా కన్వీనర్ రాజేష్ కోరారు. ఈ మేరకు కొత్తపేట మల్లయ్య భవనంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ రెండు నెలల గౌరవ వేతనాన్ని మంజూరు చేయించాలన్నారు. అదే విధంగా రాజీనామా చేసిన వలంటీర్లవి బలవంతపు రాజీనామాలుగా గుర్తించి, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు వలంటీర్‌కు రూ.10వేల జీతం తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్స్ ఒంగోలు ఉమా, షేక్ మునీరు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు



తెనాలి: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీలు ఆదివారం తెనాలిలో ఘనంగా జరిగాయి. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సహకారంతో స్థానిక బస్ స్టేషన్ సమీపంలోని క్విక్ ఫిట్ నెస్ ఎరీనాలో జరిగిన ఈ పోటీలను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయభాస్కర రావు, కార్యదర్శి ఎస్కే సంధాని పాల్గొన్నారు. విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. క్విక్ ఫిట్ నెస్ ఎరీనా నిర్వాహకురాలు, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయి రేవతి, కొమ్మినేని భార్గవ్ కుమార్, శివరామ కిరణ్‌రాజు పర్యవేక్షించారు.

21న జిల్లా అథ్లెటిక్ జట్ల ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో అండర్–14, 16 బాలబాలికలు, అండర్– 18, 20 యువతీ యువకుల జిల్లా స్థాయి అథ్లెట్ల ఎంపిక నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21న నిర్వహించినున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిని సెప్టెంబరు 14 నుంచి 16వ తేదీ వరకు ఏఎన్‌యూలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వివరాలకు 96666 35296 నంబరుకు సంప్రదించాలన్నారు.

దేవుడి పేరుతో టీడీపీ నేతల దౌర్జన్యం

- మైనార్టీ కుటుంబానికి చెందిన స్థలంలో ప్రహరీ నిర్మాణం
- సదరు స్థలం విక్రయించాలంటూ బెదిరింపులు
- మంత్రి లోకేష్ న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన



విలేకరులతో మాట్లాడుతున్న కరీమ్‌ఖాన్



నిర్మిస్తున్న ప్రహరీ

తాడేపల్లిరూరల్: టీడీపీ నాయకులు తమ అధికార బలాన్ని ఉపయోగిస్తున్నారు. మైనార్టీ కుటుంబానికి చెందిన స్థలాన్ని విక్రయించాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్నారు. కోర్టులో స్టే ఉన్నప్పటికీ స్థలంలోకి వెళ్లనీయకుండా దేవుడి గుడి పేరుతో అక్కడ ప్రహరీ నిర్మిస్తున్నారు. దీంతో బాధితులు ఆదివారం తమ ఆవేదనను వ్యక్తం చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగానమ్మ గుడి వద్ద విలేకరులతో బాధితులు కరీమ్‌ఖాన్, మొహబూబ్ ఖాన్ కుటుంబ సభ్యులు మాట్లాడారు. తాము నలుగురు అన్నదమ్ములమని, నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నట్లు తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగానమ్మ గుడి వద్ద తమకున్న స్థలానికి పక్కనే మరో ఐదు సెంట్లు కొనుగోలు చేయగా మొత్తం 25 సెంట్లు స్థలం వచ్చిందన్నారు. ఆ స్థలాన్ని తాడేపల్లి టీడీపీకి చెందిన దొంతిరెడ్డి సాంబిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి..వారికి విక్రయించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని చెప్పారు. నాలుగు రోజుల క్రితం తమ తమ్ముడికి ఫోన్ చేసి, మీ అన్నయ్యతో ఫోన్ చేయించమని చెప్పారన్నారు. సదరు వ్యక్తులకు తాను ఫోన్ చేయగా 'గతంలో లాగా ఇప్పుడు ఉండదు. ఆ స్థలాన్ని మేము చెప్పిన ధరకు అమ్మాలి. లేదంటే ఇబ్బందులు పడతావు.'అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. రాత్రికి రాత్రి గోడ నిర్మాణ పనులు చేస్తున్నారని, మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్‌ను, తహసీల్దార్‌ను కలసి వినతిపత్రం అందజేశామన్నారు. కమిషనర్ గోడ నిర్మాణ పనులు నిలిపివేయాలని స్థానిక సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లను పంపించగా వారిపై కూడా దౌర్జన్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, టీడీపీ పేరు చెప్పి చేస్తున్న ఈ దౌర్జన్యాన్ని లోకేష్ దృష్టికి తీసుకెళతామన్నారు. గతంలో కార్పొరేషన్ వారు అన్ని కొలతలు వేసి, రోడ్డు నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఇప్పుడు రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణ పనులు చేస్తున్నారని, వారి మాట వినకపోతే ఎంత దూరమైనా వెళామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగానమ్మ గుడి కమిటీ సభ్యులు స్పందిస్తూ.. అది పూర్వ కాలం నుంచి గుడి స్థలమేనని కరీమ్‌ఖాన్‌కు, వారి కుటుంబ సభ్యులకు ఇటు దారిలేదన్నారు. రెండవసారి రిజిస్ట్రేషన్ చేయించుకునే సమయంలో సర్వే నంబరు మార్చి ఇటు నుంచి దారి చూపిస్తున్నారని చెప్పారు. స్థలం గుడికే చెందాలన్నారు.

మానవ సేవే 'లయన్స్' లక్ష్యం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



కుట్టు మిషన్లు అందజేసిన మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు

నగరంపాలెం: మానవ సేవే ధ్యేయంగా లయన్స్ సేవలు అందించడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ (జిల్లా 316–హెచ్) ఏడో ప్రమాణ స్వీకారోత్సవం, సేవ కార్యక్రమాలను ఆదివారం మార్కెట్ కూడలిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వార ప్రపంచ వ్యాప్తంగా వందలాది దేశాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. నిరుపేదలకు విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల కల్పించేందుకు పెద్ద పీట వేస్తున్నారని ప్రశంసించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ మంచి ఆలోచన, మానవత్వంతో సమాజానికి అవసరమైన లయన్స్ చేపట్టే కార్యక్రమాల్లో నడిచేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పేద వర్గాలకు మరింత సేవలు అందాలని ఆకాంక్షించారు. నూతన గవర్నర్ పరుచూరి గోపీచంద్ మాట్లాడుతూ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 47 క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా మొదటి స్థానంలో ఉండేందుకు కృషిచేస్తామని చెప్పారు. అనంతరం 200 మంది మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, యాభై ఇస్త్రీ పెట్టెలు, యాభై తాపీ పనిముట్లను మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పాస్ట్ డిస్టిక్ గవర్నర్లు చిగురుపాటి వరప్రసాద్, నూతలపాటి వీరప్రకాష్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ కార్యదర్శి వి.వెంకటసుబ్బయ్య, కోశాధికారి డాక్టర్ ఎస్. చక్రపాణి, ఉగ్గిరాల సీతారామయ్య, కేవీ నగేష్, డాక్టర్ పి.నాగహరిత, బెంజిమెన్, కార్పొరేటర్ పోతురాజు సమత, రజని, ప్రసన్న, ఉషా తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు కాదు రాజ్యాధికారం కోసం పోరాడాలి

ఉస్మానియా వర్సిటీ లా కాలేజీ డీన్ డాక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్

నెహ్రూనగర్: దళితులు వర్గీకరణ కోసం కాకుండా.. రాజ్యాధికారం కోసం పోరాడాలని ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ డీన్ డాక్టర్ గాలి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు న్యాయ సమ్మతమేనా? అనే అంశంపై రాష్ట్ర స్థాయి న్యాయ సదస్సు కృషి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 90 శాతానికి పైగా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ అవుతున్న పరిస్థితుల్లో 10 శాతం రిజర్వేషన్ల కోసం మాల, మాదిగలు పోరాటాలు చేయడం బాధాకరమన్నారు. అసలు సుప్రీం కోర్టులో రిజర్వేషన్లు లేవని... అటువంటి సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు ఏ విధంగా ఇస్తుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇప్పించిందని ఎమ్మార్పీఎస్ నేతలు చెబుతున్నారంటే.. న్యాయ వ్యవస్థను మ్యానేజ్ చేస్తున్నారా అని ప్రశ్నించారు. ముందు దేశంలో అంటరానితనం, కుల నిర్మూలన చేసి తర్వాత వర్గీకరణ గురించి మాట్లాడాలనారు. అంటరానితనం నిర్మూలన జరిగితేనే దేశంలో దళితులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారని స్పష్టం చేశారు.

వర్గీకరణ తీర్పుపై మాల, మాదిగలు పోరాటాలు చేయడం మానేసి, రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైన ఉందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది శశి భూషణ్‌రావు, సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతల సుదర్శన్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అడిషనల్ సెక్రటరీ అంబటి అనిల్‌కుమార్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

బాపట్ల టౌన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల పట్టణంలోని క్రిస్టియన్‌పేటకు చెందిన బెజ్జం సువర్ణరాజు, పల్నాడు జిల్లా, నూజెండ్ల మండలానికి చెందిన వల్లపు చాణక్య వైజాక్‌లో కలిసి చదువుతున్నారు. వీరికి కాకినాడకు చెందిన సంతోష్ అనే స్నేహితుడు ఉన్నాడు. వీరంతా చెడు వ్యసనాలకు బానిసై అక్రమ మార్గాల్లో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో కాకినాడలోని స్నేహితుడు సంతోష్ వద్ద 400 గ్రాముల గంజాయిని కొని చిన్నచిన్న ప్యాకెట్లుగా తయారుచేసుకొని రైలు ద్వారా బెజ్జం సువర్ణరాజు, వల్లపు చాణక్య బాపట్ల చేరుకున్నారు. ఉప్పరపాలెం గేటు సమీపంలో రైలుదిగి మోపెడ్‌పై ప్రయాణిస్తుండగా ముందస్తు సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు దాడి చేశారు. బెజ్జం సువర్ణరాజు, వల్లపు చాణక్యలను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ ఆర్. అహ్మద్ జాని తెలిపారు.

దశ దినకర్మకు వచ్చిన స్వీపర్ మృతి

చేబ్రోలు: దశ దినకర్మకు వచ్చి ప్రమాదవశాత్తూ అప్పాపురం చానల్‌లో జారిపడి పంచాయతీ స్వీపర్ మరణించిన ఘటన మండలంలోని వడ్లమూడి గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వడ్లమూడి గ్రామానికి చెందిన పాలపర్తి రామయ్య మృతి చెందాడు. ఆదివారం అతని కర్మక్రతువుల కార్యక్రమానికి పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన పాలపర్తి కృష్ణ (54) వచ్చాడు. బంధువులతో కలిసి అప్పాపురం చానల్‌కు వెళ్లాడు. ఉధృతంగా ఉన్న నీటి ప్రవాహంలో స్నానం చేసిన వారు తిరుగు ప్రయాణమయ్యారు. కాలువ కట్టమీద నడుచుకుంటూ వస్తున్న కృష్ణ ప్రమాదవశాత్తూ జారి చానల్‌లో పడిపోయాడు. బంధువులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొంత దూరంలో తూడికాడలో ఇరుక్కుపోయి కృష్ణ మృతదేహం కనిపించింది. దీంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు నాగులపాడు పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్నట్లు బంధువులు తెలిపారు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వక్ఫ్ ఆస్తులు హస్తగతం చేసుకునేందుకు కేంద్రం యత్నం

ఆవాజ్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణపై సదస్సు



మాట్లాడుతున్న న్యాయనిపుణులు జహారా, న్యాయవాదులు సురేష్, శ్రీనివాసరావు తదితరులు

లక్ష్మీపురం: దేశంలో మూడవ అతి పెద్ద సంస్థగా ఉన్న వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం హస్తగతం చేసుకోవాలని చూస్తోందని న్యాయనిపుణులు జహారా అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వక్ఫ్ చట్ట సరవరణను వ్యతిరేస్తూ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. జహారా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో ముస్లింయేతర్లను నియమించడం చాలా దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది సురేష్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ పరం చేస్తూ.. జిల్లా కలెక్టరుకు విచక్షణాధికారాలు ఇవ్వడం సరికాదన్నారు. హైకోర్టు న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్యలను తక్షణమే నిలిపి వేయాలన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిస్టీ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణను వెనుకకు తీసుకోకపోతే రాష్ట్రంలోని లౌకిక శక్తులన్నింటినీ కలుపుకుని ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముస్లిం అడ్వకేట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మతిన్ మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమాన్ని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చాలని చూస్తోందన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో జిల్లా అధ్యక్షులు షేక్.బాషా, సీనియర్ నాయకులు ఎండీ అక్బర్, మెడికల్ రేట్స్ నాయకులు ఎండీ సలీం, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి, మిల్లి కౌన్సిల్ జిల్లా నాయకులు ముఫ్తి ఆసిఫ్ పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ స్థాపనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసూన రాణి

బాపట్ల: పొగాకు రహిత సమాజ స్థాపనే విద్యార్థుల లక్ష్యం కావాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూనరాణి తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఆదివారం టొబాకో ఫ్రీ యూత్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. ప్రసూనరాణి మాట్లాడుతూ విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయసులో విద్యార్థులు వివేకంతో మెలగాలని సూచించారు. వ్యసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. టొబాకో సంబంధిత పదార్థాలను వాడరాదని, సరదాగా ప్రారంభమైన వ్యసనం ప్రాణాంతకం అవుతుందని తెలిపారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉన్న విద్యార్థులను సమాజం హర్షిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఆదర్శ జీవనం గడపాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కాట్రగడ్డ శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాసరావు, కె. విజయ ప్రకాష్, ఎం. సంధ్య, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో అనంతపురం

తడబడిన తూర్పు గోదావరి ఉత్సాహంగా మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్



బ్యాటర్ బి.ప్రశాంత్



బౌలర్ ఎస్.సాహిల్



బౌలర్ ఎస్.అనిల్ కుమార్

మంగళగిరి: అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అండర్ – 19 మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తూర్పు గోదావరిపై అనంతపురం జట్టు పరుగుల వర్షం కురిపించింది. రెండవ రోజు ఆదివారం బ్యాటింగ్ కొనసాగించిన తూర్పు గోదావరి జట్టు 51.1 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటయ్యింది. అనంతపురం బౌలర్ ఎస్.సాహిల్ 7 వికెట్లతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 72.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసింది. బ్యాటర్ బి.ప్రశాంత్(124) సెంచరీతో విజృంభించగా, 67 పరుగులతో వెంకట్ లోకేష్ సత్తాచాటాడు. తూర్పు గోదావరి బౌలర్ ఎస్.అనిల్ కుమార్ 6 వికెట్లతో రాణించాడు. అంతకు ముందు అనంతపురం మొదటి ఇన్నింగ్స్‌లో 205 పరుగులకు పరిమితమైంది. రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 360 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఏడాదిలో స్టేడియం నిర్మాణం పూర్తి

ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)



స్టేడియం పనులు పరిశీలిస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని)

మంగళగిరి: ఏడాది లోపు క్రికెట్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసి మ్యాచ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చెప్పారు. ఆదివారం మంగళగిరి నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 15 సంవత్సరాలు ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా స్టేడియం పనులు పూర్తి కాలేదన్నారు. వెంటనే బీసీసీఐను సంప్రదించి, నిధులు విడుదల చేయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. నిడమర్రు రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడంతో పాటు స్టేడియంకు ఉన్న రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ముప్పాళ్ళ: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాదలకు చెందిన డి.మురళీకృష్ణ, వంశీ, మరో యువకుడు ముప్పాళ్ళ నుంచి మాదలకు బైకుపై వెళుతున్నారు. బొల్లవరం అడ్డరోడ్డు వద్ద సత్తెనపల్లి వైపు నుంచి నరసరావుపేట వెళుతున్న ఆటో ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): భార్యతో గొడవపడి భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భవానీపురం హెచ్‌బీకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామచంద్రపురానికి చెందిన గుమ్మడివల్లి శ్రీకాంత్ పటమటలోని హృదయాలయ ఆస్పత్రిలో మత్తు డాక్టర్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ప్రకాశం జిల్లాకు చెందిన త్రివేణితో వివాహమైంది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. కొద్దికాలం క్రితం నుంచి భవానీపురం హెచ్‌బీ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో శ్రీకాంత్ వేరే మహిళతో ఫోన్‌లో మాట్లాడటం గమనించిన త్రివేణి భర్తను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భార్యపై శ్రీకాంత్ చేయిచేసుకున్నాడు. జరిగిన విషయాన్ని అత్తమామలకు ఫోన్ ద్వారా త్రివేణి తెలిపింది. తాము వస్తామని, గొడవ పడొద్దని వారు సర్ది చెప్పారు. ఈలోగా త్రివేణి తన భర్తతో ఫోన్‌లో మాట్లాడిన మహిళకు ఫోన్ చేసి ఇంటికి రమ్మని పిలిచింది. ఆ మహిళ ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో భవానీపురంలో శ్రీకాంత్ అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చి.. శ్రీకాంత్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో మరోసారి దంపతులు గొడవపడ్డారు. శ్రీకాంత్ కొట్టడంతో ఆమె పక్కింటికి వెళ్లిపోయింది. అతను ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన కుమారుడికి ఏమైనా తినిపిద్దామని త్రివేణి ఇంటికి వెళ్లి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు గట్టిగా నెట్టడంతో గడియ ఊడిపోయింది. ఆమె బెడ్ రూంలోకి వెళ్లి చూడగా శ్రీకాంత్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. జరిగిన విషయాన్ని త్రివేణి తన బావ వెంకటేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. ఈలోగా అత్తమామలు వచ్చేసరికి శ్రీకాంత్ చనిపోయి ఉన్నాడు. దీనిపై శ్రీకాంత్ తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. తమ కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని లక్ష్మీనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. అర్బన్ పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సయ్యద్ సుభానీ (54) అడ్డ రోడ్డులోని టైర్ల షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై అడ్డ రోడ్డు సెంటర్‌లోని జాతీయ రహదారి దాటుతున్నాడు. అప్పుడే ఒంగోలు నుంచి గుంటూరు వెళ్తున్న మినీ ట్రక్కు ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుభానీని స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. సుభానీకి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జారి బావిలో పడి రైతు మృతి

సంతమాగులూరు (అద్దంకి): ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని ఏల్చూరులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన చల్లా వెంకటరెడ్డి (37) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం పొలానికి నీరు పెట్టేందుకు పైపులు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. పక్క పొలంలో పని చేసే మరో రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

వాహనం ఢీకొని యాచకురాలి మృతి



చినగంజాం: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు మృతి చెందింది. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. చినగంజాం నుంచి చీరాల వెళ్లే జాతీయ రహదారిపై ఎంత్రీ హోటల్‌కు సమీపంలో వృద్ధ యాచకురాలు శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. మోటుపల్లి పరిధిలోని ప్రాంతం కావడంతో వీఆర్వో దానియేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఆమె వివరాలు తెలియక పోవడంతో యాచకురాలిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు తెలిపారు.

చిత్రం.. భళారే విచిత్రం

- లేని ట్రాక్టర్లకు భట్టిప్రోలు పంచాయతీకి నోటీసులు
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- సంబంధం లేని వ్యక్తులకు ట్రాక్టర్లు మంజూరు
- దీని వెనుక ఎవరి హస్తం ఉందో నిగ్గు తేలాల్సి ఉంది



పప్పల రాజేష్ పేరుతో వచ్చిన నోటీసు



గుమ్మడి బాబూరావు పేరుతో వచ్చిన నోటీసు

భట్టిప్రోలు: లేని ట్రాక్టర్లకు నగదు కట్టాలంటూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి నోటీసులు అందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ (గుంటూరు) నుంచి ఈ ఏడాది జనవరిలో ఈ నోటీసులు వచ్చాయి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భట్టిప్రోలులో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు టాక్టర్, ట్రాలీ మంజూరుకు సంబంధించి రికవరీ నగదు చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భట్టిప్రోలుకు చెందిన పప్పల రాజేష్, గుమ్మడి బాబూరావుకు 2018 ఏప్రిల్ 16న రూ. 4,25,409 వ్యయం చేసే రెండు ట్రాక్టర్లు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి నెల వారీ కిస్తీ రూ.7,090 చొప్పున చెల్లించాలని నోటీసులు వచ్చాయి. నేటి వరకు కనీసం ఒక నెల కూడా చెల్లించకపోవడం గమనార్హం. మేజర్ గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేయడానికి గానూ అప్పటి పంచాయతీ కార్యదర్శి సంబంధిత తీర్మానాల్లో తెలిపిన పప్పల రాజేష్, గుమ్మడి బాబూరావుకు ట్రాక్టర్, ట్రాలీ రిజిస్ట్రేషన్ చేసి వారి ద్వారా పంచాయతీకి అందజేశారు.

సంబంధం లేని వ్యక్తులకు ట్రాక్టర్లు మంజూరు

రిజిస్ట్రేషన్ చేసిన ట్రాక్టర్లు నేటి వరకు పంచాయతీలో ఉన్న దాఖలాలు లేదు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం స్వచ్ఛ భారత్ కింద తీసుకున్న ట్రాక్టర్లను కొందరు స్వార్థపరులు తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు ఎటువంటి మోసానికైనా దిగుతారనడానికి ఈ సంఘటనే నిదర్శనం. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీపై ట్రాక్టర్లను ఆ సామాజికవర్గ అభ్యర్థులకు మాత్రమే ఇవ్వడం సాధ్యం. పంచాయతీకి ఇవ్వడానికి వీలు లేదు. ఈ నేపథ్యంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి తీర్మానం చేయడం వెనుక ఎవరి హస్తం ఉందనే విషయం నిగ్గు తేలాల్సి ఉంది. పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసే వ్యక్తులకు ఈ ట్రాక్టర్లు మంజూరు చేయాల్సి ఉండగా, సంబంధం లేని వ్యక్తులకు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటో పైవాడికే ఎరుక. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావును వివరణ కోరగా నాలుగైదు నెలల కిందట ఎస్సీ కార్పొరేషన్ నుంచి నోటీసులు వచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. ఈ విషయాన్ని సర్పంచ్ దారా రవి కిరణ్మయి దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. తాను బాధ్యతలు చేపట్టి సంవత్సరం దాటిందని, అప్పటి విషయాలు తనకు తెలియదని పేర్కొన్నారు.